

డిసెంబరులో 'స్థానికం'

● ఎన్నికలకు సిద్ధమవుతున్న డీఎంకే సర్కార్

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు డీఎంకే ప్రభుత్వం సిద్ధమైంది. అన్నీ సవ్యంగా సాగితే డిసెంబరులో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలుపెట్టింది. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్.. సీనియర్ మంత్రులతో చర్చించినట్లు తెలిసింది. పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు తమకే వస్తాయని పలు సర్వేలు చెబుతున్న నేపథ్యంలో.. తమకేమాత్రం ప్రజాదరణ తగ్గలేదని భావిస్తున్న సీఎం.. ఇదే అదనుగా స్థానిక సంస్థలకు కూడా ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.



కోయంబేడులోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం

రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహిస్తుంటారు. తమిళనాడు రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం, కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, కళ్లకుర్చి, వేలూరు, తిరుపత్తూర్, రాణిపేట, తిరునల్వేలి, తెన్‌కాశి తదితర 9 కొత్త జిల్లాలు మినహా మిగిలిన 27 జిల్లాల్లో 2019 డిసెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించింది. అప్పటికి కొత్త జిల్లాల్లో వార్డుల పునర్విభజన పూర్తికాకపోవడంతో డీఎంకే అధికారం చేపట్టిన వెంటనే సీఎం స్టాలిన్ 2021 సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రెండు విడతలుగా స్థానిక ఎన్నికలు నిర్వహించారు. తిరువళ్లూర్ జిల్లా స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు 2020 జనవరిలో పదవీప్రమాణం చేశారు. ఇక, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో గెలుపొందిన ప్రతినిధులు 2021 అక్టోబరు నెలలో పదవీ ప్రమాణం చేశారు. వీరి పదవీ కాలం ఐదేళ్లు.

వేర్వేరుగా ఎన్నికలు...

రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలంటే 27 జిల్లాలకు ఒకసారి మరో 9 జిల్లాలు మరోసారి వేర్వేరుగా నిర్వహించాల్సి వుంది. ఈ రెండో విడత ఎన్నికల నిర్వహణకు 21 నెలలు వేచి ఉండాల్సి ఉంటుంది. ఆ ప్రకారం 27 జిల్లాల్లోని స్థానిక సంస్థల ప్రతినిధుల పదవీకాలం ఈ ఏడాది డిసెంబరులో ముగియనుండగా, ఆ సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించి స్థానిక సంస్థల నిర్వహణ చేపట్టాల్సి ఉంది. అందుకు శాసనసభలో తీర్మానం కూడా చేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై సీఎం ఉన్నతాధికారులతో చర్చించారు. ఆ మేరకు 2019 డిసెంబరులో ఎన్నికలు జరిగిన స్థానిక సంస్థలకు 2024 డిసెంబరులోను, 2021 సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఎన్నికలు జరిగిన స్థానిక సంస్థలకు 2026 సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు సీఎంకు వివరించారు. అలాగే, 2026 సెప్టెంబరులో నిర్వహించాల్సిన స్థానిక ఎన్నికలు శాసనసభ ఎన్నికల తర్వాత జరగాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఫలితాలు ఎలా వుంటాయోనని యోచిస్తున్న సీఎం.. 27 జిల్లాలకు డిసెంబరులో స్థానిక ఎన్నికలు నిర్వహించడం మంచిదని భావిస్తున్నట్లు తెలిసింది.

లోక్‌సభ ఫలితాల అనంతరం...

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు డీఎంకే కూటమికి అనుకూలంగా వస్తే.. 27 జిల్లాలకు డిసెంబరులో స్థానిక సంస్థలు నిర్వహించే అవకాశాలున్నాయి. అదే సమయంలో 2026లో పదవీకాలం ముగియనున్న 9 జిల్లాల స్థానిక సంస్థలను రద్దు చేసి, వాటికి కూడా ఈ ఏడాది డిసెంబరులోనే ఎన్నికలు నిర్వహించే అవకాశముందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ విషయమై ఇప్పటికే సీనియర్ మంత్రులతో సీఎం చర్చించినట్లు సమాచారం.





అన్నానగర్‌లో వర్షంలో చిన్నారులతో బైకుపై వెళుతున్న దంపతులు - చూలైమేడులో గొడుగులువేసుకుని బస్సుకోసం వేచి చూస్తున్న మహిళలు

మరో మూడు రోజులు
భారీ వర్ష సూచన

● 3 జిల్లాలకు రెడ్ అలెర్ట్



పుదుచ్చేరి మెరీనాబీచ్‌వైపు కమ్ముకున్న మబ్బులు

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): కేరళలోకి ఈ నెల 31న నైరుతి రుతుపవనాలు ప్రవేశించనుండటం, బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం నెలకొనటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. అంతే కాకుండా స్థానిక వాతావరణ కేంద్ర అధికారులు ఈ నెల 20న మూడు జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తాయంటూ ఆ జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను, 21వ తేదీ వరకు నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను, తక్కిన జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఈ నెల 4న ప్రారంభమైన అగ్ని నక్షత్రం ఎండలు పదో తేదీ తర్వాత తీవ్రరూపం దాల్చుతాయని ప్రజలు ఆందోళన చెందారు. అయితే ఊహించని విధంగా దక్షిణ రాష్ట్రంలో ఉపరితల ఆవర్తనం కారణంగా ఏర్పడిన సుడిగాలులల కారణంగా దక్షిణాది జిల్లాల్లో పలు చోట్ల చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం మన్నార్‌జలసంధి, ఆగ్నేయ బంగాళాఖాతంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రమంతటా అకాల వర్షాలు కురుస్తున్నాయి.

మూడు జిల్లాల్లో కుండపోత

రాష్ట్రంలో తంజావూరు, పుదుకోట, శివగంగ జిల్లాల్లో ఈ నెల 20న కుండపోత వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ కేంద్రం అధికారులు ఆ మూడు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఆ జిల్లాల్లో 20 సెం.మీల మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కన్నియాకుమారి, తిరువారూరు, తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లో ఈ నెల 18నుంచి 21 వరకు భారీ వర్షాలు కురవనుండటంతో ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. తక్కిన జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అక్కడ ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతంలోనూ గత మూడు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం అక్కడి బీచ్‌లో సందర్శకులెవరినీ అనుమతించకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు. పుదుచ్చేరి, కారైక్కాల్ తదితర ప్రాంతాల్లోనూ శనివారం నుంచి సోమవారం వరకు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

చెన్నైలో భారీ వర్షం...

శుక్రవారం వేకువ జాము నుంచి నగరంలో చెదురుమదురుగా చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం ఉదయం 10 గంటల తర్వాత జోరందుకుంది. నగరంలోని రాయపేట, మైలాపూరు, తాంబరం, క్రోంపేట, గిండి, కేకే నగర్, వెస్ట్ మాంబళం, టినగర్, తేనాంపేట, కోడంబాక్కం, వడపళని, కోయంబేడు, మధురవాయల్, అమింజికరై, పురుషవాక్కం, ప్యారీస్ కార్నర్, రాయపురం, వాషర్‌మెన్ పేట, తిరువొత్తియూరు, మనలి తదితర ప్రాంతాల్లో అరగంటకు పైగా భారీగా వర్షం కురిసింది. దీంతో రహదారులలో వర్షపునీరు వరదలా ప్రవహించింది. ఈ అకాల వర్షంతో నగరమంతా చల్లటివాతావరణం నెలకొంది.

ఉత్తరాదిపై
స్టాలిన్ నజర్

● ఎన్నికల సరళిపై సీనియర్లతో చర్చలు



చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది రాష్ట్రాల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయావకాశాలపై డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పార్టీ సీనియర్ నేతలతో చర్చించారు. శుక్రవారం ఉదయం తేనాంపేటలోని అన్నాఅరివాలయం చేరుకున్న ముఖ్యమంత్రికి డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, కార్యాలయం కార్యదర్శి పూచ్చి మురుగన్ తదితర నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు సహా ఇతర నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇండియా కూటమి నేతల ప్రచార సరళి గురించి టీఆర్ బాలును అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఏయే రాష్ట్రాల్లో ఇండియా కూటమి అభ్యర్థులు ఎన్ని నియోజకవర్గాల్లో గెలిచే అవకాశాలున్నాయనే విషయంపై ఆరా తీశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీకి గతంలా భారీ మెజారిటీ వచ్చే అవకాశం లేదని ఉత్తరాది నాయకులు తనకు తెలిపినట్లు టీఆర్ బాలు చెప్పారు. అనంతరం రాష్ట్రంలో పార్టీ పరంగా చేపట్టాల్సిన చర్యలు, లోక్‌సభ ఎన్నికల్లో సక్రమంగా పనిచేయని నాయకులకు ఉద్వాసన పలికే అంశంపైనా స్టాలిన్ సమగ్రంగా చర్చలు జరిపారు. చివరగా అరివాలయం భవనం దిగువన జరుగుతున్న గదుల పునర్నిర్మాణ పనులను పార్టీ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు.

కపిల్ సిబల్‌కు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు

అడయార్, మే 17: బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ ఎంపికయ్యారు. ఆయనకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయంపై సీఎం స్టాలిన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం (బార్ కౌన్సిల్) అధ్యక్షుడిగా ఎంపికైన కపిల్ సిబల్‌కు ధన్యవాదాలు. న్యాయవాదుల సంఘం స్వతంత్ర, భారత రాజ్యాంగ సంప్రదాయాలను పరిరక్షించేలా ఆయన పనితీరు ఉండాలని సీఎం స్టాలిన్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కోరారు.

కులశేఖర పట్టణంలో 'స్పేస్ పార్క్'

● ఇస్రోతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం



ప్యారీస్, మే 17: తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఏర్పాటుకానున్న చోట 1,500 ఎకరాల్లో 'స్పేస్ పార్క్' నిర్మాణం కానుంది. ఇందుకోసం ఇస్రోతో తమిళనాడు ప్రభుత్వ నిర్వహణలోని 'టిడ్కో' ఒప్పందం కుదుర్చుకుంది. అంతరిక్ష శాఖలో అగ్రదేశాలైన అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలకు దీటుగా భారత్ కూడా వేగంగా అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తోంది. ఒకప్పుడు అమెరికా, చైనా, ఐరోపా దేశాలు అంతరిక్ష ప్రయోగంలో ముందుండేవి. ప్రస్తుతం చైనా శాస్త్రవేత్తలు కూడా ఈ ప్రయోగాలు చేపట్టారు. భారత్‌లో 1983వ సంవత్సరం నుంచి అంతరిక్షంలోకి రాకెట్ల ప్రయోగం ప్రారంభమైంది. ప్రస్తుతం భారత్‌లో నెల్లూరు జిల్లా శ్రీహరికోట వద్ద బంగాళాఖాతం తీరంలో మాత్రమే రాకెట్ ప్రయోగ కేంద్రం అందుబాటులో ఉంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతం ఉన్న తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణంలో అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏర్పాటుచేసే చర్యలు చేపట్టింది. 2,233 ఎకరాల్లో రూ.950 కోట్లతో నిర్మించనున్న ఈ కేంద్రం శంకుస్థాపన ఫిబ్రవరి 28న ప్రధాని నరేంద్ర మోదీ చేశారు. ఇదిలా ఉండగా, ఈ కేంద్ర ప్రాంగణంలోనే స్పేస్ పార్క్ ఏర్పాటుచేసేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం ఇస్రోతో టిడ్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ స్పేస్ పార్క్ అందుబాటులోకి వస్తే రాకెట్లకు అవసరమైన విడిభాగాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తయారుచేయవచ్చని, స్పేస్ పార్క్‌కు అవసరమైన స్థలాన్ని సేకరించే పనులు వేగవంతం చేసినట్లు టిడ్కో అధికారులు తెలిపారు.

కోవై మాజీ ఎమ్మెల్యే మలరవన్ మృతి

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యుడు, ఆ కార్పొరేషన్ మాజీ మేయర్ మలరవన్ శుక్రవారం ఉదయం మృతిచెందారు. మాజీముఖ్యమంత్రి జయలలిత మృతి తర్వాత ఆమె మేనకోడలు దీపా పార్టీలో చేరిన ఆయన మళ్లీ అన్నాడీఎంకేలో చేరారు. గత కొద్దినెలలుగా తీవ్ర అనారోగ్యానికి గురైన మలరవన్ రాజకీయాలకు



మాజీ ఎమ్మెల్యే మలరవన్ (ఫైల్‌ఫొటో)

దూరంగా, కోయంబత్తూరు భారతినగర్‌లోని తన నివాసంలో ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయన కన్నుమూశారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ ఈయనకు మలరవన్ అనే పేరుపెట్టి పిలవడం విశేషం. ఎంజీఆర్, జయలలితకు విశ్వాసపాత్రుడిగా మెలిగారు. పార్టీ జిల్లా శాఖ కార్యదర్శి తదితర పదవులు కూడా పొందారు.







కొడైనాడులో విరబూసిన పుష్పం
ప్రకృతి రమణీయం

పెరంబూర్, మే 17: 'కొండల యువరాణి'గా పేరొందిన దిండుగల్ జిల్లా కొడైకెనాల్ బ్రయాంట్ పార్క్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలకు 61వ పుష్ప ప్రదర్శన, వేసవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ పూంగొడి, వ్యవసాయ ఉత్పత్తుల కమిషనర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అపూర్వ ఈ ప్రదర్శన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పర్యాటక శాఖ కమిషనర్ సమయమూర్తి, ఉద్యానవన శాఖ కమిషనర్ కుమారవేల్ పాండ్యన్, ఎస్పీ ప్రదీప్, డీఐజీ అభినవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 26వ తేది వరకు 10 రోజులు జరుగనున్న ఈ పుష్ప ప్రదర్శనలో లక్ష కార్నేశన్ పూలతో చిలుక, నాటు కోడి, నెమలి, ఎలుగుబంటి తదితర నమూనాలు పర్యాటకులను ఆకట్టుకోనున్నాయి. అలాగే, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సహా పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేశారు. పారంపర్య, గ్రామీణ కళా ప్రదర్శనలు, చేపలు పట్టే పోటీలు, పెంపుడు శునకాల ప్రదర్శన సహా పలు కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ ప్రదర్శన తిలకించేందుకు పెద్దలకు రూ.75, పిల్లలకు రూ.35 ప్రవేశరుసుముగా నిర్ణయించారు. దివ్యాంగులకు ఉచిత ప్రవేశం. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనకు రావచ్చు. కాగా, గత ఏడాది కంటే ప్రవేశ రుసుము రెండు రెట్లు అధికం చేయడంపై పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పుష్ప ప్రదర్శన తిలకించేందుకు రెండు రోజులకు ముందే పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ యేడాది సమ్మర్ సీజన్ పురస్కరించుకుని ప్రతిరోజూ ఆర్ట్స్ గ్యాలరీలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో దిండుగల్ జిల్లాకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొననున్నారు.



పుష్ప ప్రదర్శనకు ఆహ్వానం



1 కాయగూరలతో రూపొందించిన జంతువులు

2 పూలతో రూపుదిద్దకున్న నెమలి, కోడిపుంజు

3 ప్రదర్శన వీక్షిస్తున్న పర్యాటకులు

సమాచార ధ్వని

ఓపెన్ వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభం

ఐసిఎఫ్, మే 17: తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ కోర్సులకు ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు వర్సిటీ రిజిస్ట్రార్ సెంథిల్‌కుమార్ తెలిపారు. ఈ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం యూజీసీ గుర్తింపు పొందిన యూజీ, పీజీ కోర్సులకు, విశ్వవిద్యాలయం నిర్వహించే ఇతర కోర్సులకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. దరఖాస్తు విధానం, ఫీజు, ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

22న నమ్మాళ్వార్ అవతారోత్సవం

ఐసిఎఫ్, మే 17: తూత్తుకుడి జిల్లా ఆళ్వార్ తిరునగర్‌లో నమ్మాళ్వార్ అవతారోత్సవాలు, 'నమ్మె ఆళుం నమ్మాళ్వార్' అనే గ్రంథావిష్కరణ ఈ నెల 22వ తేది జరుగనుంది. ఆళ్వార్ తిరునగర్ ఉడయవర్ సన్నిధి వీధిలో ఉన్న భజన మఠంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. నాడార్ మహాజన సంఘ అధ్యక్షుడు కరి గోపాల్‌రాజ్ నాడార్ పుస్తకాన్ని ఆవిష్కరించనుండగా, శివమురుగన్ ఆదిత్యన్, బాలకృష్ణన్, సెల్వరాజ్ నాడార్ పుస్తకాన్ని అందుకోనున్నారు.

23 నుంచి ఏనుగుల గణన

ఐసిఎఫ్, మే 17: ఈ నెల 23న ఏనుగుల గణన ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా ఏనుగుల గణన 2017లో జరిగింది. ఆ సమయంలో రాష్ట్రంలో 2,761 ఏనుగులున్నట్లు గుర్తించారు. అనంతరం 2023లో చేపట్టిన సర్వేలో 2,961 ఏనుగులున్నట్లు తెలిసింది. అయినప్పటికీ, స్పష్టమైన సమాచారం సేకరించేందుకు రెండో విడత ఏనుగుల గణనతమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ అటవీ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి జరుగనున్నాయి. రాష్ట్రంలో 26 అటవీ జోన్లలో ఉన్న 3,496 చ.కి.మీ విస్తీర్ణం కలిగిన ప్రాంతాల్లో 5 చ.కి.మీ చొప్పున విభజించి గణన చేపట్టనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఉపాధి పథకానికి రూ.1,229 కోట్లు

ఐసిఎఫ్, మే 17: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తొలివిడతగా రూ.1,229.04 కోట్లు కేటాయించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది రాష్ట్రానికి 20 కోట్ల పనిదినాలను కేంద్రప్రభుత్వం కేటాయించింది. ఒక రోజు వేతనంగా రూ.319 నిర్ణయించింది. ఈ పథకానికి కావలసిన నిధులు మూడు విడతలుగా అందజేస్తోంది. ఆ ప్రకారం తొలివిడతగా రూ.1,229.04 కోట్లను కేటాయించింది.

'శేక్కిలార్'కు ఆధ్యాత్మిక రచనల ఆహ్వానం

ఐసిఎఫ్, మే 17: 'శేక్కిలార్' పురస్కారానికి ఆధ్యాత్మిక రచనలు ఆహ్వానిస్తున్నట్లు చెన్నై శేక్కిలార్ పరిశోధన కేంద్రం కార్యదర్శి శివాలయం జె.మోహన్ తెలిపారు. ఈ కేంద్రం ఆధ్వర్యంలో ఉత్తమ ఆధ్యాత్మిక సాహిత్యానికి ఈ పురస్కారం అందజేస్తున్నారు. ఆ ప్రకారం, 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు విడుదలైన ఉత్తమ ఆధ్యాత్మిక గ్రంథాలకు త్వరలో పురస్కారాలు అందజేయనున్నామని, తమ రచనలను గ్రంథకర్తలు ఈ నెల 31వ తేదిలోగా రాజా అన్నామలై పురం వెంకటకృష్ణా పురం రోడ్డులో ఉన్న శేక్కిలార్ పరిశోధన కేంద్రానికి పంపించాలని మోహన్ తెలిపారు.

వాట్సాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

పెరంబూర్, మే 17: వినియోగదారులు వాట్సాప్ ద్వారా తమ విద్యుత్ బిల్లులు చెల్లించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు విద్యుత్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... 500 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించే వారు యూపీఐ ద్వారా బిల్లులు చెల్లించేలా వాట్సాప్ సదుపాయం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

తగ్గిన విద్యుత్ వినియోగం

ఐసిఎఫ్, మే 17: వేసవి అకాలవర్షాలతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం తగ్గింది. ఎండ తీవ్రత కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగం గరిష్ఠంగా 21,000 మెగావాట్లకు పెరిగింది. ఈ నేపథ్యంలో, పలు ప్రాంతాల్లో తేలికపాటి, మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా గృహాల్లో ఏసీ, ఇతర విద్యుత్ సాధనాల వినియోగం తగ్గింది. ఈనెల 15వ తేది సాయంత్రం 17,331 మెగావాట్లుండగా, 16వ తేది ఉదయం 13,831 మెగావాట్లకు తగ్గింది. దీంతో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గించారు. సోలార్ విద్యుదుత్పత్తి 4,125 మెగావాట్లుగా నమోదైంది.

బారెక్స్ రోడ్డులో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, మే 17: మెట్రోరైలు పనుల కారణంగా పెరంబూర్ బారెక్స్ రోడ్డులో వడమలై వీధి జంక్షన్ నుంచి కుట్టి వీధి వరకు శనివారం నుంచి 24వ తేది వరకు ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని పోలీసులు తెలిపారు.

- డౌటన్ జంక్షన్ నుంచి పెరంబూర్ బారెక్స్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు వడమలై జంక్షన్ నుంచి పటాలం జంక్షన్ మీదుగా వెళ్లకూడదు. ఆ వాహనాలు వడమలై వీధిలో ఎడమవైపు తిరిగి అరుణాచలం వీధి, వెంకటేశ భక్తన్ వీధి మీదుగా వెళ్లాలి.
- వడమలై వీధి, అరుణాచలం వీధి, వెంకటేశ భక్తన్ వీధులను వన్ వేగా మార్చారు.
- పటాలం జంక్షన్ నుంచి పెరంబూర్ బారెక్స్ రోడ్డు, అష్టభుజం రోడ్డు మీదుగా డౌటన్ వెళ్లే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు యధావిధిగా వెళ్లవచ్చు.
- పులియాంతోపు, ఓట్టేరి జంక్షన్ నుంచి వచ్చే బస్సులు,భారీ వాహనాలు యధావిధిగా వెళ్లవచ్చు.

డీఎంకేకు వంతపాడుతుంటే కాంగ్రెస్ అభివృద్ధి ఎలా సాధ్యం?

● తమిళిసై విమర్శ

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దశాబ్దాలుగా డీఎంకేకు వంతపాడుతుంటే కాంగ్రెస్ ఎలా అభివృద్ధి చెందగలదని, తెలంగాణా మాజీ గవర్నర్, సౌత్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశ్నించారు. ఏ పార్టీ అయినా స్వశక్తితో ఎదగాలని, ఇతర పార్టీల దయాదాక్షిణ్యాలపై ఎదగకూడదని హితవు పలికారు. శుక్రవారం ఆమె వేలూరు జిల్లా స్వర్ణాలయ సందర్శనకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... కావేరి డెల్టా జిల్లాలకు 2.5 టీఎంసీల కావేరి జలాలు విడుదల చేయాలని కావేరి నిర్వాహక మండలి కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలిచ్చినా ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇండియా కూటమిలోనే డీఎంకే, కాంగ్రెస్ పార్టీలున్నాయని, అలాంటప్పుడు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి స్టాలిన్ కావేరి జలాల కోసం ఎందుకు ఒత్తిడి చేయలేకపోతున్నారో తనకు అర్థం కావడం లేదని తమిళిసై అన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాల వ్యాపారాలు జోరుగా జరుగుతున్నా డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆమె ఆరోపించారు.

తిరువేర్కాడులో ఇళ్ల కూల్చివేతకు నోటీసు

● స్థానికుల ధర్నా, రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వారిని తొలగిస్తున్న పోలీసులు

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరువేర్కాడు మున్సిపాలిటీ పరిధిలోని పెరుమాళ్‌కోవిల్ వీధిలో కూవం మురుగు కాల్వ ఒడ్డున స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న 300 మందికి రెవెన్యూ, ప్రజాపనుల శాఖ అధికారులు నోటీసులివ్వడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ధర్నా, రాస్తా నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కూవం కాలువ ఒడ్డున ఇళ్లు నిర్మించడం వల్ల వర్షాకాలంలో ఆ కాలువలో వరదలు ఏర్పడుతున్నాయంటూ రెవెన్యూ శాఖ అధికారులు ఇదివరకే 300 ఇళ్లలో నివసిస్తున్నవారికి ఖాళీ చేయమంటూ నోటీసులిచ్చారు. ఆ నోటీసులను వారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఆ ఇళ్ల గోడలపై నోటీసులు అతికించేందుకు రెవెన్యూ, ప్రజాపనుల శాఖ అధికారులు పోలీసులతో వెళ్ళారు. ఆ ప్రాంతంలోని కొన్ని ఇళ్లకు అధికారులు నోటీసులు అతికించగానే ఆగ్రహించిన స్థానికులు వారిని అడ్డుకున్నారు. మహిళలు సహా సుమారు వందమంది తిరువేర్కాడు రహదారిపై బైఠాయించారు. వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. పోలీసులు జోక్యం చేసుకుని అందరినీ అరెస్టు చేసి సమీప ప్రాంతంలో ఉన్న కల్యాణ మండపానికి తరలించారు. ఆ తర్వాత అధికారులు ఇళ్ల గోడలపై నోటీసులు అతికిస్తూ వెళ్ళారు. ఈ సంఘటన కారణంగా ఆ ప్రాంతంలో గంటకు పైగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న తమిళిసై



విజేతలతో మాజీ గవర్నర్ తమిళిసై

వేలూరు, మే 17: మాజీ గవర్నర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తమిళిసై సౌందర్‌రాజన్ శుక్రవారం జిల్లాలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా శ్రీపురం స్వర్ణాలయంలో దర్శనం చేసుకున్నారు. అనంతరం నారాయణి పీఠం, స్వర్ణాలయం స్థాపకుడు శక్తి అమ్మను దర్శించుకొని ఆశీస్సులు పొందారు.

● గుడియాత్తం సమీపం కాకాతోపులో ఉన్న ప్రకృతి, యోగా వైద్యకళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె తండ్రి కుమారి అనంతన్‌ను తమిళిసై పరామర్శించారు. అనంతరం యోగా వైద్యకళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు, యూనిఫాం అందజేశారు.

వంద శాతం ఉత్తీర్ణత

● టీచర్లు, విద్యార్థులకు సత్కార సభ

ఐసిఎఫ్, మే 17: టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో తమిళంలో 100కు 100 మార్కులు పొందిన 43 మంది విద్యార్థులు, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సత్కార సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ప్లస్ టూ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 91.02 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 397 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. తమిళంలో 35 మంది విద్యార్థులు 100 శాతం మార్కులు పొందారు. టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో 87.97 శాతం మంది ఉత్తీర్ణత పొందారు. 1,364 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. తమిళంలో మాత్రమే 8 మంది 100 మార్కులు పొందారు. ఆ ప్రకారం, ఈ ఏడాది 1,761 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. దీంతో 100 శాతం ఉత్తీర్ణత పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తమిళంలో 100 మార్కులు పొందిన విద్యార్థులను సన్మానించనున్నారు.

పబ్లిక్ పరీక్షల ఫలితాలపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 17: పబ్లిక్ పరీక్షల ఫలితాలపై శుక్రవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఇటీవల విడుదలైన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో తక్కువ శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఉత్తీర్ణత తగ్గడానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి సహా పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ పామాయిల్, కందిపప్పు

ఐసిఎఫ్, మే 17: రేషన్ కార్డుదారులందరికీ ఈ నెలకు సంబంధించి కందిపప్పు, పామాయిల్ అందజేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా పంపిణీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 35,941 రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు బియ్యం, గోధుమలు, చక్కెర, కందిపప్పు, పామాయిల్ అందజేస్తున్నారు. రాష్ట్ర వినియోగ వస్తువుల వాణిజ్య సంస్థ ద్వారా కందిపప్పు, పామాయిల్ 2007 ఏప్రిల్ 14 నుంచి ప్రతినెలా రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్నాయి. ఆ ప్రకారం, మే నెలకు అవసరమైన 20,000 టన్నుల కందిపప్పు లేదా కెనడా పసుపు రంగు పప్పు, 2 కోట్ల పామాయిల్ ప్యాకెట్లు కొనుగోలు చేశారు. అందులో రేషన్ కార్డుదారులకు ఇప్పటివరకు 5,405 టన్నుల కందిపప్పు, 31.19 లక్షల పామాయిల్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

సీపీఎం 'ఎక్స్' పేజీ హ్యాక్

పెరంబూర్, మే 17: భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్కిస్ట్) తమిళనాడు 'ఎక్స్' పేజీని గుర్తుతెలియని వ్యక్తు హ్యాక్ చేశారు. హ్యాక్ చేసిన వ్యక్తులు, పలు ప్రకటనలు, ఫొటోలు, వార్తలు ఈ పేజీలో పోస్ట్ చేశారు. ఈ విషయమై సీపీఎం రాష్ట్ర కమిటీ విడుదల చేసిన ప్రకటనలో, సీపీఎం తమిళనాడు 'ఎక్స్'పేజీ హ్యాక్‌కు గురైందని, అందులో వస్తున్న వార్తలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయమై 'ఎక్స్' యజమాన్యానికి ఫిర్యాదు చేశామని, త్వరలోనే ఖాతా హ్యాకింగ్ నుంచి విడిపిస్తామని వారు పేర్కొన్నట్లు సీపీఎం తెలియజేసింది.

మెట్రో సేవలను మనలి వరకు పొడిగించాలి

● పది వేల మంది సంతకాలతో వినతిపత్రం

ప్యారీస్, మే 17: మెట్రోరైళ్ల సేవలను ఉత్తర చెన్నై శివారులోని మనలి పుదునగర్ వరకు పొడిగించాలంటూ 10 వేల మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులకు సమర్పించారు. మనలి పుదునగర్ ప్రాంతంలో తమిళనాడు హౌసింగ్ బోర్డు క్వార్టర్స్‌లున్నాయి. నగరం, శివారు ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివాసముంటున్నారు. మరోవైపు కంటైనర్ల టెర్మినల్, ఇతర వాణిజ్య కేంద్రాలు, లారీ పరిశ్రమలు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతున్న కారణంగా ట్రాఫిక్ తరచూ అంతరాయం ఏర్పడుతోంది. అందువల్ల ఈ ప్రాంత ప్రజలు మెట్రోరైలు సేవలు కోరుతూ సీఎంఆర్ఎల్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

పెంపుడు శునకానికి అంత్యక్రియలు

● ఇంటి వద్దే ఖననం



'రెంబో'కు కన్నీటి నివాళులర్పిస్తూ వేసిన పోస్టర్లు

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు అల్లారు ముద్దుగా పెంచిన శునకం మృతిచెందడంతో దిగులు చెందిన దాని యజమాని ఘనంగా అంత్యక్రియలు జరిపి ఇంటి వద్దే ఖననం చేసి తనకున్న జంతుప్రేమను చాటుకున్నారు. కదిర్‌గ్రామం ప్రాంతానికి చెందిన మది 2014లో డాబర్‌మేన్ రకానికి చెందిన శునకాన్ని కొనుగోలు చేసి, దానికి రెంబో అని పేరు పెట్టి పెంచాడు. ఆ శునకం మది కుటుంబ సభ్యులతో కలిసిమెలసి ఉండేది. కొద్ది రోజులకు ముందు ఆ శునకం తీవ్ర అనారోగ్యానికి గురైంది. వెటర్నరీ డాక్టర్లు ఎన్ని చికిత్సలు చేసినా ఫలితం లేక ఆకస్మికంగా మృతి చెందింది. దీంతో మది కుటుంబ సభ్యులంతా విలపించారు. ఆ తర్వాత ఆ శునకం పేరుతో ఆ ప్రాంతమంతా పోస్టర్లు వేయించారు. ఆ శునక కళేబరాన్ని పూలతో అలంకరించి పాడెమీద ఊరేగించిన తర్వాత ఇంటి వద్దే గోయి తవ్వి ఖననం చేశారు. పెంపుడు శునకంపై మది కుటుంబీకులు ప్రదర్శించిన జంతు ప్రేమ ప్రస్తుతం సోషల్‌మీడియాలో వీడియోలు హల్‌చల్ అవుతోంది.

వండలూరు-మీంజూరు మార్గంలో తుమ్మ చెట్ల తొలగింపు

ఐసిఎఫ్, మే 17: స్థానిక వండలూరు-మీంజూరు ఔటర్ రింగ్ రోడ్డులో పెరిగిన సీమ తుమ్మ చెట్లను తొలగిస్తున్నా రు. వాహనాల రాకపోకలకు అంతరాయంగా ఉన్న ఈ చెట్లు తొలగించాలని ఫిర్యాదులందడంతో రహదారుల శాఖ ముళ్ల చెట్లు తొలగించే పనులు ప్రారంభించింది. అలాగే, అటవీ శాఖతో కలసి మంచి మొక్కలు నాటనున్నట్లు అధికారులు తెలిపారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

వేలూరు, మే 17: స్థానిక పాత బైపాస్ రోడ్డు విసరణ, చిన్న వంతెనల నిర్మాణాలను రాష్ట్ర జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్ సెంథిల్ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట కోటి ఇంజనీర్ ధనశేఖరన్ సహా పలువురు అధికారులున్నారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

కోయంబేడు నుంచి తిరువణ్ణామలైకు బస్సులు

పెరంబూర్, మే 17: స్థానిక కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలైకు ప్రతిరోజూ బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం రాష్ట్ర రవాణా సంస్థ (విల్లుపురం) ఆధ్వర్యంలో కిలంబాక్కం బస్‌స్టేషన్ నుంచి తిరువణ్ణామలైకు బస్సులు నడుపుతున్నారు. తిరువణ్ణామలై వైపు వెళ్లే వారు అధికంగా కోయంబేడు మార్కెట్, చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేస్తున్నారు. తమ సౌకర్యార్థం కోయంబేడు నుంచి బస్సులు నడపాలని వారు విజ్ఞప్తి చేశారు. దానిని పరిశీలించిన రవాణా సంస్థ, ఈ కోయంబేడు నుంచి తిరువణ్ణామలైకు నెల 23 నుంచి బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆ ప్రకారం, కిలంబాక్కం నుంచి దిండివనం, సెంజి మార్గంగా 90 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు నుంచి 44 బస్సులు ఆర్కాడు, ఆర్కాడు మీదుగా, మరో మార్గంలో కాంచీపురం, వందవాసి మార్గంగా నడుస్తున్న 11 బస్సులతో పాటు అదనంగా మరో 30 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు నుంచి తిరువణ్ణామలైకు ప్రతిరోజు 85 బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

హజ్ యాత్రకు 5.800 మంది

పెరంబూర్, మే 17: రాష్ట్రం నుంచి 5,800 మంది హజ్ యాత్రకు వెళ్లనున్నారు. తమిళనాడు హజ్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ... ఈ ఏడాది దేశం నుంచి 1.75 లక్షల మంది హజ్ యాత్రకు వెళ్లనున్నారన్నారు. రాష్ట్రం నుంచి ఈ నెల 26వ తేది నుంచి పలు విడతలుగా 5.800 మంది, ప్రైవేటు సంస్థల ద్వారా 2,800 హజ్ యాత్రకు వెళ్లనున్నారని, గత ఏడాదితో పోల్చితే హజ్ యాత్రకు వెళ్లేవారి సంఖ్య అధికమని ఆయన తెలిపారు.

టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ గడువు పెంపు

పెరంబూర్, మే 17: ఉపాధ్యాయుల జనరల్ బదిలీ కౌన్సెలింగ్ దరఖాస్తుల స్వీకరణ మరో ఏడు రోజులు పొడిగించినట్లు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగియనుందని ప్రకటించగా, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు మరో వారం రోజులు పొడిగించారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనేవారు పాఠశాలలో ఏడాదిగా పనిచేయాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

టెన్త్ విద్యార్థినికి వివాహం

● అడ్డుకున్న అధికారులు

అడయార్, మే 17: స్థానిక ట్రిప్లికేన్‌లో పదో తరగతి విద్యార్థినికి 32 యేళ్ళ వ్యక్తితో జరగాల్సిన వివాహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు అడ్డుకున్నారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, చేపాక్కం ప్రాంతానికి చెందిన బాలిక ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. ఈ బాలికకు ట్రిప్లికేన్‌కు చెందిన ఆదిఫ్ జావిద్ (32) అనే వ్యక్తితో పెళ్ళి చేయాలని ఆ బాలిత తల్లిదండ్రులు భావించి, ఏర్పాట్లు చేశారు. ఈ విషయం బయటకు పొక్కడంతో కొంతమంది బాలల సంక్షేమ విభాగం 1098 నంబరుకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో రంగంలోకి దిగిన జిల్లా సాంఘిక సంక్షేమ విభాగం అధికారులు, పోలీసులు.. ఈ వివాహాన్ని అడ్డుకుని, బాలికను రక్షించారు. అలాగే, బాలికను పెళ్లి చేసుకునేందుకు ముందుకు వచ్చిన జావిద్‌ను అరెస్టు చేశారు.

జయకుమార్ హత్య కేసు విచారణ మార్పు ?

అడయార్, మే 17: తిరునెల్వేలి ఈస్ట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జయకుమార్ ధనసింగ్ (60) హత్య కేసు విచారణ ఒకటి రెండు రోజుల్లో సీబీసీఐడీకి ప్రభుత్వం బదిలీ చేసే అవకాశం ఉంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు ఒక్క ఆధారాన్ని కూడా సేకరించలేకపోయారు.. దీంతో ఈ కేసు విచారణను సీబీసీఐడీకి మార్చాలని పోలీసు శాఖ భావిస్తుంది. ఈ నెల 2వ తేదీ అదృశ్యమైన జయకుమార్ 4వ తేదీ అనుమానాస్పదరీతిలో హత్యకు గురైన విషయం తెల్సిందే. ఈ హత్య కేసులోని మిస్టరీని ఛేదించేందుకు పది ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసినా ఒక్క ఆధారాన్ని కూడా సేకరించలేపోయాయి. దీంతో ఈ కేసు విచారణను సీబీసీఐడీ పోలీసులకు ప్రభుత్వం అప్పగించనుంది.

కొడైకెనాల్ ఘాట్‌రోడ్డులో కారు, లారీ ఢీ

● ప్రయాణికులకు తప్పిన ముప్పు



కారుపై వాలిన లారీ

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్ వత్తలగుండు ఘాట్‌రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం కర్ణాటక నుండి పర్యాటకులతో వస్తున్న కారును, ఎదురుగా అదుపుతప్పిన లారీ ఢీ కొంది. ఈ సంఘటనలో లారీ కారుపై పూర్తిగా వాలింది. దీంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. అదృష్టవశత్తూ కారులో ప్రయాణించినవారికి, లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు తగలలేదు. ఈప్రమాదం కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

తిరుమల ఘాట్‌లో వ్యాను బోల్తా

● అదుపుతప్పి కొండను ఢీకొన్న కారు

● 12 మంది చెన్నై భక్తులకు స్వల్పగాయాలు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. చెన్నైకి చెందిన 12 మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన ఎనిమిది మంది భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఓ వ్యానులో శుక్రవారం మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైంది. అలిపిరికి సమీపంలో మాల్వాడి గుండం వద్ద అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడింది. అదృష్టవశాత్తూ వాహనంలోని వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా వెనుకవస్తున్న టీటీడీ వాటర్ ట్యాంకర్ కూడా ఒక్కసారిగా అదుపుకోల్పోయింది. సడన్ బ్రేక్ వేయడంతో వాహనం జారి.. రోడ్డుగా అడ్డుగా నిలబడింది. అలాగే 19వ మలుపు వద్ద కూడా ఓ కారు కూడా అదుపుతప్పి కుడివైపునున్న కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోనూ చెన్నైకి చెందిన నలుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వర్షం కారణంగా ఈప్రమాదాలు జరిగినట్లు భక్తులు తెలిపారు.

స్నేహితుడి ఇంటికి డిన్నర్‌కు వచ్చి మృత్యు ఒడికి..

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తమిళనాడు యువకుల మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

నగరి, మే17: స్నేహితుడి ఇంటికి డిన్నర్ కోసం వచ్చి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు కన్యాకుమారి జిల్లా రామనాథపురానికి చెందిన కన్నన్(28), ఇళంగోవన్(26), చిత్తూరు జిల్లా నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడకు చెందిన సంజయ్(29) చెన్నై తాంబరంలోని రెడిమేడ్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్నారు. సంజయ్ ఇంట్లో డిన్నర్‌కు వచ్చి ముగ్గురూ తిరిగి చెన్నై వెళ్తుండగా తడుకుపేట హౌసింగ్‌కాలనీ వద్ద ఆగి ఉన్న వ్యానును వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కన్నన్, ఇళంగోవన్ అక్కడికక్కడే మృతిచెందగా సంజయ్‌కు తీవ్ర గాయాలై కాళ్లు విరిగిపోవడంతో చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం శుక్రవారం బంధువులకు అప్పగించారు.

ప్రియుడితో వివాహం జరిపించాలంటూ.. పోలీస్‌స్టేషన్‌కు యువతి

ప్యారీస్, మే 17: చెంగల్పట్టు జిల్లా గుడువాంజేరి పోలీస్‌స్టేషన్‌లో ప్రియుడితో వివాహం జరిపించాలని పట్టుబట్టిన ఓ యువతి అర్ధరాత్రి వరకు నిరీక్షించిన ఘటన గురువారం జరిగింది. పొత్తేరి ప్రాంతానికి చెందిన పొన్‌ముత్తుకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె తమిళరసి (26) గుడువాంజేరి సమీపంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఐదేళ్లుగా పనిచేస్తూ తన తోటి ఉద్యోగి వండలూరుకు చెందిన అరవింద్‌ను ప్రేమించినట్లు తెలిసింది. వీరి ప్రేమ విషయం నాలుగేళ్ల క్రితమే రెండు కుటుంబాలకు తెలిసినప్పటికీ, వేర్వేరు కులాలు కావడంతో అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో, గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గుడువాంజేరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తమిళరసి, ప్రియుడితో తనకు వివాహం జరిపించాలని, లేని పక్షంలో ఆత్మహత్యకు పాల్పడతానని రాసిన లేఖను పోలీసులకు అందజేసింది. ప్రియుడి కోసం వెళ్లిన పోలీసులు అర్ధరాత్రి వరకు తిరిగి రాకపోవడంతో ఆమె అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే నిరీక్షించింది.

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఆత్మహత్య

ప్యారీస్, మే 17: తేని జిల్లా కంభం సమీపంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విషంతాగి మృత్యువాతపడ్డారు. పోలీసుల కథనం మేరకు... కంభం సమీపంలోని వ్యవసాయ భూమిలో కేరళ రిజిస్ట్రేషన్ నెంబరు కలిగిన కారు అనుమానాస్పదంగా నిలిపివుంది. ఆ దారిన వెళ్లిన వారిచ్చిన సమాచారంతో అక్కడికెళ్లిన పోలీసులు, కారులోని మూడు మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టంకు తరలించారు. విచారణలో... మృతులు కేరళ రాష్ట్రం కొట్టాయం పుదుంబిల్‌హౌస్ ప్రాంతానికి చెందిన జార్జ్ సిక్రియా (60), ఆయన భార్య మెర్సీ (58), కుమారుడు అఖిల్ (28) అని తెలిసింది. కాగా, పోస్టుమార్టంలో ఈ ముగ్గురూ విషంతాగి మరణించినట్లు తేలినట్టు కంభం నార్త్ డివిజన్ పోలీసులు తెలిపారు.

నటుడు కార్తీక్ కుమార్ వ్యాఖ్యలపై విచారణకు ఆదేశం

అడయార్, మే 17: షెడ్యూల్ కులాల ప్రజలను కించపరిచేలా మాట్లాడినట్టు నటుడు కార్తీక్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ ఆదేశించింది. పుదుక్కోటకు చెందిన అంబేద్కర్ మక్కల్ ఇయ్యక్కం అధ్యక్షుడు ఇలమురుగు ముత్తు జాతీయ కమిషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్ ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. నటుడు కార్తీక్ కుమార్ తన మాజీ భార్యతో మాట్లాడుతూ, షెడ్యూల్ కులాల ప్రజలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్టుగా ఒక ఆడియో వైరల్ అవుతుంది. దీన్ని ఆధారంగా చేసుకుని ఇలమురుగు ముత్తు ఫిర్యాదు చేశారు. దానిని విచారణకు స్వీకరించిన జాతీయ కమిషనర్.. నటుడు కార్తీక్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరపాలని సైబర్ క్రైమ్ విభాగాన్ని ఆదేశించడమే కాకుండా, నివేదిక సమర్పించాలని కోరింది.

కోవైలో మత్తు మాత్రల విక్రయం

ఐదుగురి అరెస్టు

అడయార్, మే 17: కర్ణాటక రాష్ట్ర నుంచి అక్రమంగా మత్తు మాత్రలను తీసుకొచ్చి కోయంబత్తూరులో విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 116 మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ శెట్టి (36), కోవైకు చెందిన సాహుల్ హమీద్ (27), మురుగన్ (27), రియాజ్ ఖాన్ (24), అక్బర్ అలీ (28) అనే వారిపై కోవై కరుంబుకడై పోలీసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఉద్యోగిపై మొసలి దాడి

ఐసిఎఫ్, మే 17: స్థానిక వండలకూరు జూ పార్క్‌లో ఉద్యోగిపై మొసలి దాడికి పాల్పడింది. ఈ పార్క్‌లో 2,400లకు పైగా జంతువులను సంరక్షిస్తున్నారు. పార్క్‌లో తాత్కాలిక ఉద్యోగి విజయ్ ఓ మొసలికి ఆహారం అందిస్తుండగా దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆయనను సహోద్యోగులు విడిపించి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కాలికి ఏర్పడిన గాయానికి 5 కుట్లు వేసి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

రైల్‌కోచ్ ఫుడ్ సెంటర్‌లో రూ.2.42 లక్షల చోరీ

అడయార్, మే 17: స్థానిక పెరియమేట్‌లోని సబర్బన్ రైళ్ళు రాకపోకలు సాగించే ప్రాంగణంలో ఉన్న రైల్ కోచ్ ఫుడ్ సెంటరులో రూ.2.42 లక్షలతో పాటు ఆరు మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఇదే విషయంపై పోలీసులకు ఫుడ్ సెంటర్ మేనేజర్ ఫిర్యాదులో చేశారు.. మేనేజర్ బాలాజీ ఇచ్చిన ఫిర్యాదులో ఈ ఫుడ్ సెంటరులో వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఇబ్రాన్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీ తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో కోచ్‌ను శుభ్రం చేస్తూ, ఆ తర్వాత అక్కడ నుంచి అదృశ్యమైపోయాడు. ఈ విషయాన్ని గ్రహించిన తాము క్యాష్ బాక్స్ తెరిచి చూడగా అందులో ఉన్న రూ.1,66,265 నగదుతో పాటు, ఈ ఫుడ్ సెంటరులో పనిచేసే వారి రూ.75,925 నగదు, మరో ఆరు మొబైల్ ఫోన్లు కనిపించలేదని బాలాజీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న ఇబ్రాన్ కోసం గాలిస్తున్నారు.

3 రోజులు నీలగిరికి రావద్దు

● కలెక్టర్ అరుణ వినతి



చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మూడు రోజులపాటు భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించడంతో ఈ నెల 18 నుంచి 20 వరకు పర్యాటకులు తమ పర్యటన వాయిదా వేసుకుంటే మంచిదని ఆ జిల్లా కలెక్టర్ అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేశారు. ఓ వైపు అకాల వర్షం కారణంగా అగ్నినక్షత్రం ఎండలు తగ్గుముఖం పట్టడం, మరో వైపు పాఠశాల, కళాశాలల వేసవి సెలవులు, వీటికి తోడు ప్రస్తుతం వారాంతపు సెలవులు కూడా వస్తుండటంతో నీలగిరి జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన ఊటీకి పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారు. ఈ నేపథ్యంలో నీలగిరి జిల్లాల్లో ఈ నెల 18 నుండి 20 దాకా భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ఆ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ కూడా జారీ చేశారు. దీంతో భారీ వర్ష సూచనలు ఉండటంతో పర్యాటకులు ఈ మూడు రోజులు నీలగిరి జిల్లాలో పర్యటించకుండా ఉంటే శ్రేయస్కరమని ఆ జిల్లా కలెక్టర్ అరుణ విజ్ఞప్తి చేశారు.

పాత కుట్రాలం జలపాతం వద్ద వరదలు

● నీట మునిగి బాలుడి దుర్మరణం



నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలుడిని వెదికేందుకు వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా పాత కుట్రాలం జలపాతం వద్ద శుక్రవారం ఉదయం నీటి ప్రవాహం ఉధృతంగా పడటంతో స్నానం చేస్తున్న బాలుడు నీటిలో కొట్టుకుపోయి శవంగా బయటపడ్డాడు. తెన్‌కాశి జిల్లాలోని పడమటి కనుమల ప్రాంతాల్లో రెండు రోజులుగా కుండ పోతగా వర్షాలు కురవటంతో జిల్లాలోని జలాశయాలు, జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. ముఖ్యంగా సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలైన పాత కుట్రాలం, ప్రధాన జలపాతం, ఐందరువి తదితర జలపాతాల్లో నీటి ఉధృతి పెరిగింది. ఈ నేపథ్యంలో తిరునల్వేలికి చెందిన అశ్విన్ అనే బాలుడు కుటుంబంతో శుక్రవారం ఉదయం పాత కుట్రాలం వెళ్ళాడు. ఆ జలపాతం జలధారలో ఆ బాలుడు స్నానం చేస్తుండగా నీరు వరదలా వేగంగా కిందకు రావడంతో అశ్విన్ జల ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కళ్ళ ముందే బాలుడు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండటం చూసి కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి చెందారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హుటాహుటిన ఆ జలపాతం వద్దకు వెళ్ళిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు తీవ్రంగా గాలించి అశ్విన్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో రికార్డు స్థాయిలో సౌర విద్యుదుత్పత్తి

పెరంబూర్, మే 17: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో గత ఏప్రిల్‌లో 1.77 లక్షల యూనిట్ల సౌర విద్యుదుత్పత్తి జరిగింది. పర్యావరణాన్ని పరిరక్షించేలా ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుదుత్పత్తి చేపట్టిన జీసీసీ, 2017లో రూ.30 కోట్లతో కార్పొరేషన్ కార్యాలయం, పాఠశాలల భవనాలు, ఆసుపత్రి భవనాలు మొత్తం 620 భవనాలపై సౌర విద్యుదుత్పత్తి ప్రారంభించింది. దీంతో జీసీసీకి నెలకు రూ.10 లక్షల వరకు విద్యుత్ ఖర్చు ఆదా అవుతోంది. ఈ నేపథ్యంలో, గత నెల ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఒకే నెలలో 1.77 లక్షల యూనిట్ల సౌర విద్యుదుత్పత్తి జరిగింది. దీని ద్వారా కార్పొరేషన్‌కు రూ.16 లక్షల వరకు ఆదా అయిందని జీసీసీ అధికారులు తెలిపారు.



తరుణి

ఒక చిన్న ప్రేరణ మనిషితో అద్భుతాలు చేయిస్తుంది. గమ్యాన్ని, గమనాన్ని మారుస్తుంది. శిఖరాగ్రాలు చేరుకొనేలా ప్రయత్నింపజేస్తుంది. పట్టుదల పెంచి లక్ష్యాన్ని చేరుకునేలాగా చేస్తుంది. మహానుభావుల జీవితచరిత్రలు చదివి ప్రేరణ పొందే వారు కొందరైతే, మహనీయుల వాక్కులతో స్ఫూర్తిపొందే వారు మరికొందరు. ఆకోవలోనే పాటల పోటీల్లో విజేతగా నిలిచిన ఆ విద్యార్థినికి, పలువురి ప్రశంసలు తన భావి జీవిత గమ్యాన్ని మార్చుకొనేలా చేశాయి. డాక్టర్ కావాలనుకున్న లక్ష్యాన్ని గాయనిగా గుర్తింపు పొందే వైపు మళ్లించాయి. తను గాయనిగా ఎదిగేటందుకు దోహదం చేసాయి. ఆ దిశలో ప్రయాణిస్తూ వర్ధమానగాయనిగా రాణిస్తున్న ఆమే 'రేష్మా శ్యామ్'.... ఆ గాయని సంగీత ప్రస్థానం నేటి 'తరుణి'లో....

- వేళచ్చేరి



రేష్మా

పాటల చరిష్మా 'రేష్మా'

● వర్ధమాన నేపథ్య గాయని 'రేష్మా శ్యామ్'

రేష్మా పుట్టి, పెరిగింది చెన్నై నగరంలో. ఎస్‌బీఓఏ స్కూలులో 10వ తరగతి వరకు చదివిన రేష్మా మొగప్పేర్‌లోని వేలమ్మాళ్ పాఠశాలలో ప్లస్‌టూ వరకు చదివి స్టెల్లా మేరీస్ కాలేజి నుంచి డిగ్రీ పొందింది.



కుటుంబసభ్యులతో...

లక్ష్యం మారింది ఇలా....

బాల్యం నుంచి రేష్మాకి డాక్టర్ కావలన్న కోరిక ఉండేది. దానికి తగిన కృషి కూడా చేసేది. 11వ తరగతి చదివే సమయంలో స్కూలు తరఫున ఎన్నో సంగీత పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది. అందరి ప్రశంసలు ఆమెలో గాయని కావాలనే బలమైన కోరికకు బీజం పడింది. డాక్టర్ కావాలన్న లక్ష్యం మారి గాయనిగా స్థిరపడాలన్న ఆశయం ప్రబలింది. సంగీతమే ప్రథమ ప్రాధాన్యం అయింది. కానీ తల్లిదండ్రుల కోరిక మేరకు డిగ్రీ పూర్తిచేసాకే తన ఆశయ సాధనకు శ్రీకారం చుట్టింది. బాల్యంలో పదేళ్లపాటు నేర్చుకున్న శాస్త్రీయ సంగీతం రేష్మా ఆశయానికి గట్టి పునాది వేసింది. కాలేజీ చదువు పూర్తిచేశాక దృష్టినంతా సంగీతం పైనే కేంద్రీకరించింది. కేఎం కన్జర్వేటరీ కాలేజీలో రెండేళ్లపాటు హిందుస్తానీ సంగీతం, రుక్మిణి రమణి వద్ద ఏడాదిన్నర కాలం పాటు శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. సినిమా సంగీతంపై ఉన్న అభిలాషతో యూ ట్యూబ్ ద్వారా ఆ సంగీతం అభ్యసించింది. కీర్తి శేషులు ఎం.బాలమురళీకృష్ణ, భాగ్యలక్ష్మి మొదలైన ప్రఖ్యాత సంగీత గురువుల వద్ద 16 సంవత్సరాలపాటు శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందింది రేష్మా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ వరుసకు మనవరాలైన రేష్మాకు బాల్యం నుంచే సంగీతతృష్ణ తీగలు సాగింది. కర్ణాటక, శాస్త్రీయ, హిందుస్తానీ సంగీతాలు నేర్చుకునీ ఆమె లలిత సంగీతంలో కూడా ప్రావీణ్యం సంపాదించింది. వైద్యనాథన్ వద్ద లలిత సంగీతం, వాయిస్ కల్చర్, సాంకేతిక అంశాలు మొదలైన విషయాల్లో శిక్షణ పొందింది. గాత్రనిపుణులు అనంత్ వద్ద గాత్రానికి సంబంధించిన అంశాల్లో నేర్పు సాధించింది.

రియాలిటీ షోలు...

సూపర్ సింగర్ సీజన్-8, సన్ సింగర్ సీజన్-8, సూపర్ సింగర్ జూనియర్ సీజన్-5,కలర్స్ తమిళ్ సింగింగ్ స్టార్స్ మొదలైన రియాలిటీ షోలలో పాల్గొన్న రేష్మా బహుమతులు గెలుచుకున్నది.

ప్రచార కార్యక్రమాలు...

నేచురల్స్, పూర్వికా, టోనీ అండ్ గై, స్పైస్ పాట్, ఫ్రెష్ 2డే సూపర్ మార్కెట్, సింహానియా శారీస్ మొదలైన పేరు పొందిన బ్రాండ్స్ ప్రచార కార్యక్రమంలో నటించింది రేష్మా.



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో...

ప్రదర్శనలు...

దేశమంతటా మూడు భాషల్లో 150కి పైగా ప్రదర్శనల్లో తన గానంతో ప్రేక్షకులనలరించిన రేష్మా సీఆర్పీఎఫ్ కోసం నిర్వహించిన కార్యక్రమంలో పాడిన పాటలకు ప్రశంసల జల్లులు కురిసాయి. తమిళనాడులోని 10 పట్టణాల్లో ఇతర కళాకారులతో కలసి విజయ్ టీవీ వారి 'విజయ్ కొండాట్టమ్' కార్యక్రమంలో పాల్గొన్న ఘనత సాధించింది. ఆఫ్రికా, ఇండోనేషియా, కువైట్, శ్రీలంక, మలేసియా, సింగపూర్ మొదలైన దేశాల్లో తన గాన మాధుర్యంతో శ్రోతలను పరవశింపజేసింది. జ్యూయల్ ఒన్, వెన్‌కాప్ బ్రాండ్ల ప్రచారానికి పాటలు పాడింది రేష్మా.

రేష్మా డబ్బింగ్ చెప్పటంలో కూడా అనుభవం పొందింది. 'కమాండో' వెబ్ సిరీస్ తమిళం, తెలుగు భాషల్లో గాత్రదానం గావించింది. 'అవుటర్ రేంజ్' చిత్రం తెలుగు, తమిళంలో ఒక పాత్రకు గాత్రదానం చేసింది. బహువిధ ప్రజ్ఞలతో రేష్మా ముందుకు దూసుకుపోతోంది. నేపథ్యగాయనిగా పేరుప్రతిష్ఠలు సంపాదించాలని, ఈ రంగంలో ఒక స్థాయికి చేరాలని ఆమె ఆశయం. తను పాడిన పాటలతో భవిష్యత్తులో కన్సర్ట్ చేయాలన్నది తన లక్ష్యంగా తెలిపింది రేష్మా.

"ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయాలి. ఏదీ సులభంగా సాధ్యం కాదు. ఎంత ఎత్తుకు ఎదిగినా వినయంగా ఉండడం ప్రధానంగా భావించాలి" అని రేష్మా తన అభిప్రాయాలను తరుణితో పంచుకుంది.



వేదికపై కచేరీ చేస్తూ...

నేపథ్యగానం... : తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల చిత్రాలలో దాదాపు 50కి పైగా పాటలు పాడి సంగీత దర్శకులను మెప్పించింది రేష్మా. 'కాంతారా' సినిమాలో 'సింగారా సిరుక్కి....' పాట తమిళం, మలయాళ భాషల్లో రేష్మానే గానం చేసింది.'హేసినామికా' తెలుగు సినిమాలో 'ఫ్రీడమ్...ఫ్రీడమ్....' పాట రేష్మా పాడినదే. వరల్డ్ ఫేమస్ లవర్, జేమ్స్ అండ్ అలిస్, కోమలి, సిక్కాడ, జై బాలయ్య, బడేమియా చోటే మియా (తమిళం, తెలుగు భాషల్లో) మొదలైన చిత్రాలలో తన నేపథ్యగానంతో అందరిని మైమరపింపజేసింది. ఎన్నో చిత్రాల్లో కోరస్‌లో కూడా తన గొంతు కలిపింది.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ

అడయార్, మే 17: రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన వీఐటీ-చెన్నై స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ సంయుక్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ ఇచ్చాయి. ఈ సమ్మర్ క్యాంపు ఈ నెల 13న ప్రారంభమై 17వ తేదీతో ముగిసింది. ఇందులో 5 నుంచి 9వ తరగతులకు చెందిన 50 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు వీఐటీ అందించిన ఆర్థిక సాయంతో ఉచిత ఆహారం, ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాథన్ పాల్గొని విద్యార్థులు అవార్డుతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం డీన్ డాక్టర్ ఆర్.గణేశన్, వీఐటీ చెన్నై ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ వి.అరుణ్ కుమార్, డాక్టర్ డి.సాథియన్, డాక్ట్ వి.వాసుగి, డాక్టర్ వి.విద్య తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో డాక్టర్ శేఖర్ విశ్వనాథన్ తదితరులు

వరల్డ్ యూనివర్సిటీ రోయింగ్ చాంప్‌కు ఎస్‌ఆర్‌ఎం జట్టు



విద్యార్థులతో జట్టు కోచ్

అడయార్, మే 17: వరల్డ్ యూనివర్సిటీ రోయింగ్ చాంపియన్‌షిప్ 2024కు శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, సెంటర్ ఫర్ స్పోర్ట్స్‌కు చెందిన విద్యార్థి జట్టు ఎంపికైంది. ఈ టోర్నీ జూలై 3 నుంచి ఆరో తేదీ వరకు నెదర్లాండ్స్ వేదికగా జరుగనుంది. ఈ ఈవెంట్‌ను ది ఇంటర్నేషనల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వహించనుంది. ఎస్‌ఆర్‌ఎం జట్టులో యక్షిత్ సాయి, రోజ్ మెస్టికా, ఎస్.తమిళ్ సెల్వి ఉండగా, సీనియర్ కోచ్ ఏ.భాస్కర రెడ్డి కూడా ఈ టోర్నీకి ఎంపికయ్యారు. ఈ జట్టును ఛాన్సలర్ డాక్టర్ వీఆర్ వెంకటాచలం అభినందిస్తూ, విద్యార్థులందరికీ రూ.9 లక్షలు, కోచ్‌కు రూ.2.8 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమ శేఖర్, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకమూడి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆరుముగం, డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్, ఫైనాన్స్ డైరెక్టర్ జె.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

ప్యారీస్, మే 17: కాలజ్ఞానబ్రహ్మ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవం శుక్రవారం కొరట్టూరులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో జరిగింది వీరబ్రహ్మేంద్రస్వామి చారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 18వ సంవత్సర ఆరాధన ఉదయం 7.30 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల అభిషేకాలతో ప్రారంభమయ్యాయి. 9 గంటలకు సహస్రనామార్చన జరిపించారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో లోకకల్యాణార్థం యాగాలు నిర్వహించారు. 10 గంటలకు యాగ వైభవంపై పలువురు వక్తలు ఉపన్యసించారు. వైశాఖ శుద్ధ దశమి రోజున పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవసమాధిలోకి ప్రవేశించిన సందర్భంగా ఆ పర్వదినాన్ని పురస్కరించుకొని కొరట్టూరు ఆశ్రమంలో మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు బాలసాయిబాబా సేవా సమితి భజన గీతాల కార్యక్రమం జరిగింది. వేడుకల ఏర్పాట్లను ట్రస్ట్ అధ్యక్షుడు టి.వీరభద్రరావు, కార్యదర్శి ఏఎస్ బలరామమూర్తి, ట్రస్టీలు ఎం.కిషోర్, కె.సీతారామశర్మ తదితరులు పర్యవేక్షించారు. ఈ ఆరాధనోత్సవంలో నగరంలోని పలు తెలుగు సంఘాల నిర్వాహకులు, తెలుగు ప్రముఖులు హాజరై కాలజ్ఞాన బ్రహ్మను దర్శించుకున్నారు.



కాలజ్ఞానబ్రహ్మ యాగపూజలో నిర్వాహకులు

వేదారణ్యంలో 'అల'జడి

● చేపలవేటకు వెళ్లని జాలర్లు

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో నాగపట్టినం జిల్లా వేదారణ్యం పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వేకువజాము వరకు సముద్రంలో రాక్షస అలలు ఎగసిపడుతున్నాయి. పెనుగాలులు కూడా అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో వేదారణ్యం పరిసర ప్రాంతాల జాలర్లు మూడు రోజులపాటు చేపలవేటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఉదయం వేదారణ్యం, ఆట్టుతురై, కోడియక్కరై, పుష్పవనం, వెళ్లపళ్లం తదితర పది జాలర్ల కుప్పాల్లో నివసిస్తున్న సుమారు పదివేలమంది జాలర్లు చేపలవేటకు వెళ్లకుండా సముద్రతీరాల్లోని పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



తీరం వద్ద పడవలో వలలకు మరమ్మతు చేసుకుంటున్న జాలర్లు



చెన్నై కోడంబాక్కం జోన్ కన్నమ్మాపేట వద్ద రూ.7.21 కోట్లతో నిర్మిస్తున్న పెట్ క్లినిక్ పనులను పరిశీలిస్తున్న గ్రేటర్ చెన్నైకార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్

వైభవంగా గంగమ్మ జాతర

వేలూరు, మే 17: ఆనైకట్టు డివిజన్ ఊసూరు సమీపం వీరారెడ్డిపాళ్యం, వెల్లూరుపాళ్యంలో ఉన్న గంగమ్మ ఆలయంలో శుక్రవారం గంగ జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గర్భగుడిలోని గంగమ్మకు అభిషేకం, ప్రత్యేక అలంకారం, మహాదీపారాధన నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి అంబళ్ల పోసి, పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చునున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామకృష్ణన్, సెక్రటరీ రమేష్, కోశాధికారి టీకా రామన్, పంచాయతి మండ్రం అధ్యక్షుడు సురేష్, కౌన్సిలర్ అమ్ము బాలకృష్ణన్, జిల్లా కౌన్సిలర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చిత్ర బృందంతో నిర్మాత ఐసరి కె.గణేష్

పీటీ సార్‌కు, ఇంగ్లీష్ టీచర్‌కు పెళ్లి చేశా

● నిర్మాత ఐసరి కె.గణేష్ ● 24న 'పీటీ సార్' రిలీజ్

చిత్రజ్యోతి

తాను పదో తరగతిలో ఉన్నప్పుడే తమ స్కూల్ పీటీ సార్, ఇంగ్లీష్ టీచర్ల ప్రేమకు మధ్యవర్తిగా ఉండి వారిద్దరికీ వివాహం చేసినట్టు ప్రముఖ సినీ నిర్మాత, వేల్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఐసరి కె.గణేష్ వెల్లడించారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై ఆయన తాజాగా నిర్మించిన చిత్రం 'పి.టి.సార్. హిప్‌హాప్ ఆది హీరో. కాశ్మీరా పరదేశి హీరోయిన్. ఇతర పాత్రల్లో మధువంతి, ప్రణీక, అనికా సురేంద్రన్ తదితరులు నటించగా కార్తీక్ వేణుగోపాలన్ దర్శకత్వం వహించారు.. మంచి సందేశంతో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఈ నెల 24వ తేదీ విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నగరంలో ఆ చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇందులో చిత్ర నిర్మాత ఐసరి కె.గణేష్ మాట్లాడుతూ, 'తమ బ్యానరులో ఒక మంచి సినిమా నిర్మించామన్న తృప్తి ఈ చిత్రం ద్వారా కలిగింది. తొలి అర్ధభాగం ఎంతో జాలీగా గడిచిపోతుంది. రెండో భాగంలో మంచి సందేశంతో ఎమోషనల్‌గా సాగుతుంది. సాధారణంగా అన్ని పాఠశాలల్లో పీటీ సార్‌కు, ఇంగ్లీష్ టీచర్‌కు మధ్య ప్రేమ ఉంటుంది. దీన్ని కథాంశంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. నేను పదో తరగతి చదవుకునే రోజుల్లో పీటీ సార్‌కు, ఇంగ్లీష్ టీచర్ ప్రేమకు మధ్యవర్తిగా ఉండటమేకాకుండా, వారిద్దరికి పెళ్లి కూడా చేశాను. సినిమా చూసిన తర్వాత మీడియా మిత్రులు రివ్యూల్లో వాస్తవాలనే రాయాలని కోరుతున్నా. హీరో హిప్ ఆప్ ఆది మాట్లాడుతూ, నాలుగేళ్ళ విరామం తర్వాత సంగీతం దర్శకుడిగా పనిచేశాను. ఇందులోని పాటలకు మంచి స్పందన వచ్చింది. ప్రతి మహిళ ఎదుర్కొనే సమస్యను ఇందులో ప్రస్తావించడం జరిగింది' తెలిపారు. హీరోయిన్ కాశ్మీరా పరదేశితో పాటు ఇతర నటీనటులు ప్రసంగిస్తూ, చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

కష్టాలకు ఎదురొడ్డి నిలబడితేనే విజయం


● ఆర్వీ ఉదయకుమార్



'పగలరియాన్' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రపరిశ్రమలో సక్సెస్ అనేది అంత సులభంగా దక్కదని ప్రముఖ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ అన్నారు. కష్టాలు, తిట్లు, విమర్శలు ఇలాంటివాటినన్నింటిని తట్టుకుని నిలబడిన వారినే విజయం వరిస్తుందన్నారు. వెట్రి హీరోగా మురుగన్ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కిన చిత్రం 'పగలరియాన్'. అక్షయ హీరోయిన్. త్వరలో విడుదలకానున్న ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను గురువారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఇందులో దర్శకులు ఆర్వీ ఉదయకుమార్, పేరరసు, సుబ్రమణ్యశివ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయకుమార్ మాట్లాడుతూ, 'ఈ చిత్ర దర్శకుడు మురుగన్ సినీ అవకాశాల కోసం 15 యేళ్ళపాటు సాలిగ్రామం వీధుల్లో తిరిగారు. అవకాశం రాకపోవడంతో సొంతంగా చిత్ర నిర్మాణం చేపట్టడమేకాకుండా ఇందులో ఓ కీలక పాత్ర పోషించి తద్వారా తన కోరిక నెరవేర్చుకున్నారు. ఈ క్రమంలో ఆయన అనేక కష్టాలు, ఇబ్బందులు, విమర్శలు, తిట్లు తిన్నారు. చిత్ర పరిశ్రమలో సక్సెస్ అనేది రాత్రికి రాత్రే రాదు. ఇలాంటివన్నీ ఎదుర్కొని మొండిగా నిలబడితేనే విజయం వరిస్తుంది. హీరో వెట్రి తన పంథాను మార్చుకోకుండా, వెట్రిగానే ఉంటూ సినీ కెరీర్ కొనసాగించాలని కోరుతున్నాను' అని సూచించారు. దర్శక నటుడు సుబ్రమణ్యశివ మాట్లాడుతూ, 'సినిమాల్లో నటించాలన్న బలమైన కాంక్షతో చెన్నై వచ్చి ఒక సినిమా ఛాన్స్ కోసం 15 యేళ్ళపాటు తిరిగి అలసిపోయిన ఒక వ్యక్తి ఇపుడు ఏకంగా ఒక చిత్రాన్ని నిర్మించి అందులో హీరో మినహా కొత్తవారికి అవకాశం ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. ఇలాంటి వారికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి' అని కోరారు. హీరో వెట్రి మాట్లాడుతూ, 'ఒక మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మీడియాతో పాటు ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. దర్శకుడు పేరరసు, చిత్ర దర్శకుడు మురుగన్, హీరోయిన్ అక్షయ తదితరులు ప్రసంగించారు. రిషికేష్ ఎంటర్‌టైన్మెంట్‌పతాకంపై లతా మురుగన్ నిర్మించిన ఈ చిత్రానికి వివేక్ సారో సంగీతం.

విజయ్ సేతుపతి కొత్త చిత్రం పేరు 'ఏస్'



'ఏస్' ఫస్ట్‌లుక్

'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి 51వ చిత్రం టైటిల్ శుక్రవారం వెల్లడించారు. 'ఏస్' అనే పేరుతో రూపుదిద్దుకునే ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రం ద్వారా ఆర్ముగకుమార్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇతర పాత్రల్లో రుక్మిణి వసంతి, యోగిబాబు, పీఎస్ అవినాష్, దివ్య పిళ్ళై, బబ్లూ, రాజ్‌కుమార్ తదితరులు నటించారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూరుస్తుండగా కమర్షియల్ హంగులతో ఈ చిత్రాన్ని భారీ వ్యయంతో 4సీఎస్ ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణ సంస్థ నిర్మిస్తుంది. తాజాగా విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌లో విజయ్ సేతుపతి డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నారు. అలాగే, టైటిల్‌కు సంబంధించిన టీజర్‌లో కూడా ప్రముఖ ఆరిస్టుల పరిచయం, నేపథ్య సంగీతం, విజయ్ సేతుపతిని తెరపై చూపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇందులో గ్యాంబ్లింగ్, తుపాకులు, పేలుళ్ళు, దోపిడీలు, బైక్ ఛేజింగ్ వంటి అంశాలు ఉన్నప్పటికీ యోగిబాబు టైమింగ్ పంచ్ డైలాగులు, కామెడీ ఓ స్థాయిలో ఉంది. కాగా, ఈ యేడాది విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటిస్తున్న రెండో చిత్రం కావడం గమనార్హం.

గ్లామర్ షోను నమ్ముకున్న శివానీ!

పాఠశాల విద్య నుంచే సీరియల్స్‌లో నటిస్తూ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన హీరోయిన్ శివానీ నారాయణన్ ఇపుడు గ్లామర్ షోను నమ్ముకుంది. 'బిగ్ బాస్' తమిళ సీరియల్‌తో ఒక్కసారిగా గుర్తింపు పొందిన ఆమె... ఆ తర్వాత 'విక్రమ్', 'డీఎస్పీ', 'నాయ్ శేఖర్' వంటి విభిన్నమైన చిత్రాల్లో నటించినప్పటికీ ఆమెకు సరైన అవకాశాలు రాలేదు. అదే సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో మాత్రం నిత్యం యాక్టివ్‌గా ఉంటూ గ్లామర్ షో చేస్తోంది. ఇదే పంథాను సినిమాల్లో కూడా కొనసాగించాలని ఆమె ఓ నిర్ణయానికి రావడమేకాకుండా, కొన్ని ఫొటోలను సైతం సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇపుడు వైరల్ అయ్యాయి.



శివానీ నారాయణన్